క్లుప్తంగా

తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు



గుడపల్లి పల్లిపాలెంలో తాగునీటి ట్యాంకు నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే రాపాక వర ప్రసాదరావు

మలికిపురం: నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు రాజోలు ఎమ్మెల్యే రాపాక వర ప్రసాదరావు అన్నారు. మలికిపురం మండలం గూడపల్లి పల్లిపాలెంలో జల్‌జీవన్ మిషన్ నిధులతో నిర్మించనున్న మంచినీటి ట్యాంకు, పైపు లైన్ పనులకు ఎమ్మెల్యే రాపాక శనివారం భూమి పూజ చేశారు. కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న జల్‌జీవన్ మిషన్ పథకం ద్వారా తాగునీటి సమస్యలు కనుమరుగవుతున్నాయన్నారు. అడిగిన వెంటనే ఇంటింటికీ తాగునీటి కుళాయి ఇస్తున్న ప్రభుత్వం ఇదేనన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ బల్ల ప్రసన్నకుమారి, మండల పార్టీ అధ్యక్షుడు అడబాల వీర బ్రహ్మాజీరావు, సర్పంచ్ పెచ్చెట్టి నరసింహస్వామి, యల్లమిల్లి కృష్ణమూర్తి, కానుబోయిన గోపాలకృష్ణ, స్థానిక ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

చేనేత కార్మికులకు చేయూత

సఖినేటిపల్లి: మోరిలో సంక్రాంతి సందర్భంగా శనివారం స్థానిక వెన్నెల స్వచ్ఛంద సేవా సంస్థ చేనేత కార్మికులకు చేయూతనిచ్చింది. పండగ పురస్కరించుకుని 120 మంది కార్మికులకు 12 రకాల నిత్యావసరాలతో కూడిన కిట్లను సంస్థ నిర్వాహకులు అందజేశారు. కాగా గత ఏడు సంవత్సరాలుగా క్రమం తప్పకుండా సంక్రాంతికి కార్మికులకు తమ వంతు సాయాన్ని అందజేస్తున్నామన్నారు. సంస్థ నిర్వాహకులు బూశిం చిన బాబూరావు, పడవల వీవీ సత్యనారాయణ, బళ్ల సురేష్‌కుమార్, బిళ్ల మల్లేశ్వరరావు, బిళ్ల మెహర్‌ప్రకాష్, బొమ్మిడి జయరాం, బళ్ల సత్యనారాయణ, బెల్లంకొండ కొండయ్య పాల్గొన్నారు.

అగ్నిప్రమాద బాధితులకు సాయం

అయినవిల్లి: మండలంలోని శంకరాయగూడెంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా సర్వం కోల్పోయిన బాధితులకు బీజేపీ పి.గన్నవరం నియోజకవర్గ కన్వీనర్ చీకురుమిల్లి వెంకటేశ్వరరావు శనివారం సాయం అందజేశారు. అగ్నిప్రమాద బాధితులు పితాని వీర వెంకటేశ్వరరావు, బొక్కా విజయ్ కుటుంబాలు అగ్నిప్రమాదంలో సర్వం కాలిపోయి కట్టుబట్టలతో మిగిలారు. వీరికి శనివారం బీజేపీ పి.గన్నవరం నియోజకవర్గ కన్వీనర్ చీకురుమిల్లి వెంకటేశ్వరరావు పరామర్శించి, బియ్యం, నిత్యావసరాలు, నగదు అందజేశారు. ఆయన వెంట కిసాన్ మోర్చా మండల అధ్యక్షుడు వేటుకూరు శ్రీనివాసరాజు, మండల బీజేపీ అధ్యక్షుడు కుడుపూడి చంద్రశేఖర్ తదితరులు ఉన్నారు.

బాడీ బిల్డింగ్‌లో గోల్డ్ మెడల్



విజేత అబ్బులును అభినందిస్తున్న ప్రభాకరరావు తదితరులు

ఆలమూరు: మండలంలోని కలవచర్లకు చెందిన గ్రామ రెవెన్యూ అధికారి తాతపూడి అబ్బులు జిల్లా బాడీ బిల్డింగ్ పోటీల్లో చక్కని ప్రతిభను కనబర్చి గోల్డ్ మెడల్ సాధించారు. జిల్లా కేంద్రమైన అమలాపురం హెల్త్ ఫిట్నెస్ జిమ్ ఆవరణలో కంకిపాటి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో గోదావరి జోనల్ మాస్టర్స్ బాడీ బిల్డింగ్ పోటీలు శనివారం జరిగాయి. ఈ పోటీల్లో అబ్బులు ప్రథమ స్థానం సాధించారు. ఈ సందర్భంగా అబ్బులును లక్కీ ఫిట్నెస్ జిమ్ అధినేత రామిరెడ్డి, విజయలక్ష్మి ఆర్థోపెడిక్ హాస్పిటల్ అధినేత కర్రి వీర్రెడ్డి, మార్షల్ ఆర్ట్స్ గౌరవ అధ్యక్షుడు చల్లా ప్రభాకరరావు తదితరులు అభినందించారు.

రావులపాలెం సీఐగా ఆంజనేయులు



రావులపాలెం: స్థానిక పోలీస్ స్టేషన్ అప్‌గ్రేడ్ కావడంతో ఎస్సై స్థానంలో సీఐ ర్యాంక్ అధికారి బాధ్యతలు నిర్వహించేలా మారింది. దీంతో నూతన సీఐగా తణుకు రూరల్ సీఐగా ఉన్న సీహెచ్ ఆంజనేయులు బదిలీపై రావులపాలెం వచ్చారు. శనివారం ఆయన స్థానిక స్టేషన్‌లో బాధ్యతలు చేపట్టారు. అప్‌గ్రేడ్ స్టేషన్‌కు మొట్టమొదటి సీఐగా బాధ్యతలు స్వీకరించడంతో ఆయనకు ఇతర పోలీస్‌సిబ్బంది అభినందనలు తెలిపారు.

'ఆప్తా' ఆధ్వర్యంలో వాలీబాల్ టోర్నమెంట్

అయినవిల్లి: అమెరికన్ ప్రోగ్రెస్ తెలుగు అసోసియేషన్(ఆప్తా) చైర్మన్ ముద్రగడ త్రినాథ్ ఆధ్వర్యంలో నేషనల్ అంపైర్ శివకుమార్ సీహెచ్ సత్యానందం, గొలకోటి ఫణీంద్రకుమార్, మెహర్ వాసు పర్యవేక్షణలో వీరవల్లిపాలెంలో శనివారం వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా ఎంపీడీఓ తాడి శ్రీవెంకటాచార్య, కల్వకోలను తాతాజీ, డీఎంఆర్ శేఖర్, చీకురుమిల్లి వెంకటేశ్వరరావు హాజరయ్యారు. ముద్రగడ త్రినాథ్ వీరవల్లిపాలెంలో పుట్టి అమెరికాలో అత్యున్నత స్థానానికి చేరుకుని ఆప్త ద్వారా అనేక సేవలు అందిస్తున్నారన్నారు. సంక్రాంతి సందర్భంగా వాలీబాల్ టోర్నమెంట్ ద్వారా యువతకు క్రీడలపై ఆసక్తిని కల్పిస్తున్నారు. రూ.15 వేలు, మెమెంటోలు విజేతలకు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ సర్పంచ్ సలాది బుచ్చిరాజు తదితరులు పాల్గొన్నారు.

సంక్రాంతి సందడి ఆరంభం

- విదేశాల నుంచి స్వగ్రామాలకు చేరుకుంటున్న ప్రవాసాంధ్రులు
- 16న జగ్గన్నతోటలో కనువిందు చేయనున్న ఏకాదశ రుద్రులు



గంగలకుర్రు అగ్రహారంలో ప్రభను సిద్ధం చేస్తున్న భక్తులు

అంబాజీపేట: సంక్రాంతి పండగలో ప్రధానమైనది ప్రభల ఉత్సవం. కనుమ రోజున మొసలపల్లి శివారు జగ్గన్నతోటలో నిర్వహించే ప్రభల ఉత్సవం కోనసీమకే తలమానికం. 11 గ్రామాల నుంచి తరలివచ్చే ఈశ్వర రూపాల రుద్రప్రభలతో పాటు పిల్ల ప్రభలు తీర్థంలో పాల్గొంటాయి. ఈ నెల 16న జగ్గన్నతోటలో జరిగి ప్రభల తీర్థానికి ఆయా గ్రామాల్లో యువకులు ప్రభలను సిద్ధం చేసే పనుల్లో నిమగ్నమయ్యారు. ఈ ప్రభలకు 410 ఏళ్ల పైబడి చరిత్ర ఉంది. లోకకల్యాణం కోసం పెద్దాపురం సంస్థానాధీశుడు రాజా వత్సవాయి జగన్నాథరాజు (జగ్గన్న) హయాంలో తొలిసారిగా 17వ శతాబ్దంలో ఈ తీర్థాన్ని మొసలపల్లి శివారు జగ్గన్నతోటలో నిర్వహించారు. ఉత్తరాయణ ప్రవేశ ఏకాదశ రుద్రులను దర్శించుకుంటే శుభం జరుగుతుందనే ఉద్దేశంతో జగ్గన్నతోట ప్రభల ఉత్సవాలు ప్రారంభమయ్యాయి.

తీర్థంలో కొలువుతీరే ప్రభలు

వ్యాఘ్రేశ్వరం వ్యాఘ్రేశ్వరస్వామి, కె.పెదపూడి మేనకేశ్వరస్వామి, గంగలకుర్రు అగ్రహారం వీరేశ్వరస్వామి, గంగలకుర్రు చెన్నమల్లేశ్వరస్వామి, వక్కలంక కాశీవిశ్వేశ్వరస్వామి, నేదునూరు చెన్నమల్లేశ్వరస్వామి, ముక్కామల రాఘవేశ్వరస్వామి, మొసలపల్లి మధుమానంత భోగేశ్వరస్వామి, పాలగుమ్మి చెన్నమల్లేశ్వరస్వామి, పుల్లేటికుర్రు అభినవ వ్యాఘ్రేశ్వరస్వామి ఇక్కడికి వస్తాయి. వ్యాఘ్రేశ్వరం నుంచి తరలివచ్చే వ్యాఘ్రేశ్వరస్వామి ఈ తీర్థానికి అధ్యక్షత వహిస్తారు. అలాగే కౌశిక అవతలి వైపునున్న గంగలకుర్రు, గంగలకుర్రు అగ్రహారం ప్రభలు కౌశికలో దిగి తీర్థంలో ప్రవేశించడం చూపరులను గగుర్పాటుకు గురిచేస్తుంది. తొండవరంలో జరిగే ప్రభల తీర్థంలో కొలువుదీరే వాకలగరువు, తొండవరం ప్రభలు జిల్లాలో అన్ని ప్రభల కంటే ఎత్తులో నిర్మించడం ప్రత్యేకత. సుమారు 52 అడుగుల ఎత్తులో ఉండే ఈ ప్రభలు ఒకదానికంటే ఒకటి పోటీ పడుతుంటాయి. చిరతపూడి చిట్టిచెరువు గట్టు వద్ద చిరతపూడి వీరభద్రస్వామి, కుందాలపల్లి, పప్పులవారిపాలెం, మోడేకుర్రు, చిట్టిచెరువు గట్టు, అవిడి, చినపాలెంలకు చెందిన ప్రభలు కొలువుదీరుతాయి.

ఆత్రేయపురం మండలంలో..

ఆత్రేయపురం: గ్రామాల నుంచి రానురానూ పట్టణాలకు వలస పెరిగిపోవడం వల్ల చాలా గ్రామాలు కళా విహీనమవుతున్నాయి. పెద్ద సంఖ్యలో ఇక్కడ చదువుకున్న విద్యార్థులు ఇతర దేశాలకు దేశవ్యాప్తంగా ముఖ్యపట్టణాలకు చేరుకుని ఉద్యోగాలను, పెద్ద మొత్తం జీతాలను ఉపాధి పొందుతున్నారు. దీంతో ఎక్కువ మంది పట్టణాలకు వెళ్లడానికే మొగ్గు చూపుతున్నారు. అందువల్ల చాలా గ్రామాల్లో వృత్తి పనులు చేసుకునే రజకులు, కుమ్మరి, మంగలి చేతి వృత్తులు చేసుకునే వ్యక్తులు పట్టణాల్లో హెచ్చుమొత్తం నగదు పనులకు లభిస్తున్నాయని పట్టణాలకు ఉపాధి కోసం వెళుతున్నారు. ప్రధానంగా గ్రామీణ ప్రాంతాల్లో కోడి పందేలు, సంప్రదాయ హరిదాసులు, గంగిరెద్దులు, ముగ్గులు పోటీలు వాటిని చూడటం కోసం మొగ్గు చూపుతున్నారు. హైదరాబాద్‌లో స్థిరపడిన పలువురు వ్యాపార, సినీ ప్రముఖులు ఆత్రేయపురం చేరుకున్నారు. అలాగే విదేశాల నుంచి సైతం ప్రవాసాంధ్రులు స్వగ్రామాలకు చేరుకున్నారు.

ఆత్రేయపురంలో పడవ పందేలు

- రాష్ట్ర చరిత్రలో మొట్ట మొదటిసారి పడవల పోటీలు
- ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా ప్రారంభం



ఆత్రేయపురంలో పడవ పందేలను ప్రారంభించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే జగ్గిరెడ్డి

ఆత్రేయపురం: గ్రామంలో బొబ్బర్లంక-ఆత్రేయపురం ప్రధాన పంట కాలువలో ఏర్పాటు చేసిన కేరళ తరహా పడవల పోటీలు, ఈత పోటీలను కొత్తపేట ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి వైఎస్సార్ సీపీ శ్రేణులతో కలసి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ పర్యాటక కేంద్రంగా ఆత్రేయపురం మండలం కోనసీమ కేరళగా లొల్ల లాకుల వద్ద నుంచి ధవళేశ్వరం బ్యారేజీ వరకు మండలంలోని అన్ని గ్రామాలను పర్యటక కేంద్రాలుగా అభివృద్ధి చేస్తామన్నారు. సంక్రాంతికి సొంత వాళ్లతో సంతోషంగా గడపడానికి ఊరికి వచ్చే అందరికీ కొత్తపేట నియోజకవర్గంలో వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. సంక్రాంతి అంటే కొత్తపేట అనే విధంగా జరిగే ప్రభల ఉత్సవాలు, బాణసంచా కాల్పులు, సంప్రదాయ కోడి పందేలు, కోనసీమ తిరుపతి వాడపల్లి శ్రీవేంకటేశ్వర స్వామి దేవస్థానంలో జరిగే సంక్రాంతి సంబరాలు, అవిడిలో జరిగే ప్రభల తీర్థం, రావులపాలెం సీఆర్‌సీ ఆధ్వర్యంలో నిర్వహించే వేమన జయంతి, సంక్రాంతి సంబరాల్లో సాంస్కృతిక కార్యక్రమాలు ప్రజలకు ఈ సంక్రాంతి సంవత్సరం మొత్తం గుర్తుంచుకునే మంచి జ్ఞాపకంలా ఉండాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సంప్రదాయ నృత్యాలు తిలకించి కళాకారులను అభినందించారు. ఈ రకమైన పోటీలను మనకు పరిచయం చేసిన వైఎస్సార్ సీపీ కోనసీమ జిల్లా ఎస్సీ సెల్ చైర్మన్ కప్పల శ్రీధర్, రెడ్ క్రాస్ సొసైటీ ప్రతినిధి ప్రకాష్‌లను కార్యక్రమం నిర్వహిస్తున్న చిర్ల యూత్ ఫోర్సు సభ్యులను, పీఈటీలను ప్రత్యేకంగా అభినందించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో సంక్షేమ పథకాలు అర్హులైన అందరికీ అందాలని, అందరూ కుటుంబ సభ్యులతో సంతోషంగా జరుపుకోవాలన్నారు.

ఆత్రేయపురం గ్రామంలో అల్లూరి సీతారామరాజు పేరు మీద రూ.కోటితో చెరువును అభివృద్ధి చేసి పార్కుగా తీర్చిదిద్దామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

'విప్పర్తి'ని కలసిన మండల కమిటీ నాయకులు



పి.గన్నవరంలో నియోజకవర్గ ఇన్‌చార్జి విప్పర్తిని సత్కరిస్తున్న మండల కమిటీ నాయకులు

పి.గన్నవరం: వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు ఒక కుటుంబంలా కలిసి మెలిసి పనిచేసి జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎంగా గెలిపించాలని నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి విప్పర్తి వేణుగోపాలరావు అన్నారు. పార్టీ ఇన్‌చార్జిగా విప్పర్తి నియమితులైన తర్వాత మండల కమిటీ నాయకులు తొలిసారిగా శనివారం పి.గన్నవరంలో ఆయన్ను కలసి దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించారు. పార్టీ విజయం కోసం విప్పర్తితో కలసి పనిచేస్తామని నాయకులు అన్నారు. మండల శాఖ అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో విప్పర్తి మాట్లాడుతూ జగన్ అందిస్తున్న సుపరిపాలనను, ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. సంక్రాంతి పండగ తర్వాత మండల కమిటీ సమావేశం నిర్వహిస్తామని విప్పర్తి తెలిపారు. ఏఎంసీ చైర్‌పర్సన్ నక్కా కృష్ణవేణి, సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు తోలేటి బంగారునాయుడు, సర్పంచ్ వడలి కొండయ్య, రాష్ట్ర నాయకులు దొమ్మేటి వెంకటశివ రామన్, యన్నాబత్తుల వెంకటేశ్వరరావు, మండల ఉపాధ్యక్షుడు దొమ్మేటి దుర్గారావు, మండల ప్రధాన కార్యదర్శులు సాధనాల రమేష్, గుత్తుల మధు, మంగం చిట్టిబాబు, నాయకులు చిట్టాల ఆర్యశ్రీను తదితరులు పాల్గొన్నారు.

అన్ని వర్గాలతో అనుబంధం ఎప్పటికీ శాశ్వతం

- ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ జగ్గిరెడ్డి
- పూజారిపాలెం గ్రామస్తులకు జగ్గిరెడ్డి అభిమాన విందు



పలివెల శివారు పూజారిపాలెంలో విందు కార్యక్రమంలో మహిళలతో ఎమ్మెల్యే జగ్గిరెడ్డి

కొత్తపేట: నియోజకవర్గంలో తన తండ్రి డాక్టర్ సోమసుందరరెడ్డి హయాం నుంచి తమ కుటుంబంతో కుల, మత, వర్గాలకు అతీతంగా ఏర్పడిన అనుబంధం ఎప్పటికీ శాశ్వతమని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. ఎమ్మెల్యే జగ్గిరెడ్డి తండ్రి మాజీ ఎమ్మెల్యే డాక్టర్ చిర్ల సోమసుందరరెడ్డికి పలివెల శివారు గ్రామం పూజారిపాలెంతో ప్రత్యేక అనుబంధం ఉండేది. ఆ గ్రామం ఎప్పుడూ ఆయన వెంటే ఉంటూ మద్దతుగా నిలిచింది. ఆయన తదనంతరం కూడా ఆయన తనయుడు జగ్గిరెడ్డి వెంటే నడుస్తుంది. ఇదిలా ఉండగా ఈనెల 10న దివంగత మాజీ ఎమ్మెల్యే డాక్టర్ చిర్ల సోమసుందరరెడ్డి జయంతి పురస్కరించుకుని జగ్గిరెడ్డి ఆ గ్రామస్తులకు విందు ఏర్పాటు చేయాలనుకున్నారు. కానీ ఆ రోజు అవకాశం లేక శుక్రవారం రాత్రి ప్రత్యేకంగా అభిమాన విందు నిర్వహించారు. ఆ గ్రామంలో సుమారు 1,500 మందికి ఆయనే స్వయంగా భోజనం వడ్డించారు. ఆయన మాట్లాడుతూ ఈ నియోజకవర్గంలో తమది స్వల్ప సంఖ్యాక వర్గమైనప్పటికీ అన్ని వర్గాల ప్రజలు తమ తాత, పూర్వపు కొత్తపేట పంచాయతీ సమితి ప్రప్రథమ అధ్యక్షుడు జగ్గిరెడ్డి, తన తండ్రి డాక్టర్ సోమసుందరరెడ్డి హయాం నుంచీ నియోజకవర్గ ప్రజలు తమ కుటుంబంపై ఆదరాభిమానాలు చూపిస్తున్నారన్నారు. వారందరినీ మా కుటుంబ సభ్యులుగానే భావిస్తున్నామన్నారు. ఆపద, అత్యవసర సమయాల్లో వచ్చి తమ తలుపుతట్టిన వారెవరైనా సరే కాదనకుండా ఆదుకోవడం, వారి అవసరాలు తీర్చడం, వారి సమస్యలు పరిష్కరించడం తన తండ్రి హయాం నుంచీ ప్రారంభమైందన్నారు. అదే ఒరవడి తానూ కొనసాగిస్తునాన్ననన్నారు. నాటి నుంచీ తమ కుటుంబానికి అండగా నిలిచిన నియోజకవర్గ ప్రజలకు ఎప్పుడూ కృతజ్ఞుడిగా ఉంటానని జగ్గిరెడ్డి పునరుద్ఘాటించారు. కార్యక్రమంలో ఎంపీపీ మార్గన గంగాధరరావు, అవిడి సర్పంచ్ రెడ్డి చంటి, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జ్ పొనుగుపాటి సత్యనారాయణ, గ్రామ పార్టీ అధ్యక్షుడు తులా సూరిబాబు, పలివెల ధర్మసత్రం చైర్మన్ చప్పిడి సాయిబాబు తదితరులు పాల్గొన్నారు.

చేతివృత్తుల అభ్యున్నతికి ప్రధాని మోదీ ప్రాధాన్యం

సఖినేటిపల్లి: చేతివృత్తులు, కులవృత్తుల వారికి నైపుణ్యం తెచ్చి వారి అభ్యున్నతికి ప్రధాని మోదీ ప్రాధాన్యమిస్తున్నారని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ మెంబర్ అడబాల సత్యనారాయణ, పార్టీ జిల్లా అధికార ప్రతినిధి మాలే శ్రీనివాస నగేష్ అన్నారు. శనివారం సఖినేటిపల్లిలంక, అంతర్వేదిపాలెం గ్రామాల్లో ఎంపీడీవో బడుగు మంగాదేవి వికసిత్ భారత్ సంకల్పయాత్ర సమావేశాలు నిర్వహించారు. సఖినేటిపల్లిలంకలో సర్పంచ్ రేవూరి రాజేశ్వరి, అంతర్వేదిపాలెంలో నల్లి లీలావతి అధ్యక్షతన జరిగిన సమావేశాల్లో వారు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. కేంద్ర పథకాలు పేదలకు తెలిపేందుకు గ్రామ, గ్రామాన ఆయా శాఖల ద్వారా అవగాహన సమావేశాలు నిర్వహిస్తున్నామని ఎంపీడీవో మంగాదేవి అన్నారు. బీజేపీ నాయకులు చెంపాటి శివరామకృష్ణంరాజు, అడబాల రాంబాబు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సూర్యుడి జాడేదీ..



మంచులో జీవనోపాధికై ప్రయాణిస్తున్న కూలీలు

వాతావరణమంతా పొగ మంచు కమ్మేయడంతో శనివారం ఉదయం 9.30 గంటలు దాటినా సూర్యుడి జాడ కనిపించలేదు. వెలుగు తెరలు లేవలేదు. వెలుతురును మంచుదుప్పటితో కప్పేసింది. మంచు దట్టంగా ఆవరించడడంతో అడుగు దూరంలో ఉన్నవి కూడా కనిపించని పరిస్థితి ఏర్పడింది. వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది. ఉద యం 9 గంటలకు అంబాజీపేటలో దృశ్యాలు ఇవి... –అంబాజీపేట

ఉత్సాహంగా ముగ్గుల పోటీలు



రాజోలులో రంగవల్లుల పోటీల్లో పాల్గొన్న మహిళలు

మామిడికుదురు: సంక్రాంతి సందర్భంగా మగటపల్లిలో శనివారం ముగ్గుల పోటీలు జరిగాయి. మహిళలు ఎంతో ఉత్సాహంగా పోటీలో పాల్గొన్నారు. పోటీలో విజేతలకు సర్పంచ్ సూరిశెట్టి లక్ష్మి నగదు బహుమతితో పాటు షీల్డులు అందించారు. మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షుడు సూరిశెట్టి చంటిబాబు, వైఎస్సార్ సీపీ నేతలు బొలిశెట్టి భగవాన్, సూరిశెట్టి బాబి, బండారు పండు, శ్రీవాజ్‌పేయి సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు నక్కా త్రిలోచనరావు, స్థానికులు పాల్గొన్నారు.

రాజోలులో..

రాజోలు: విప్రో సంతూర్ ఆధ్వర్యంలో రాజోలులో శనివారం నిర్వహించిన రంగవల్లుల పోటీలు అలరించాయి. పోటీల్లో 34 మంది మహిళలు, బాలికలు పాల్గొన్నారు.

విజేతలకు ట్రావెల్ బ్యాగ్స్, డిన్నర్ సెట్స్, హాట్ బాక్స్‌లు బహుమతులుగా అందజేశారు. ఎంఈఓ తాడి ప్రసాద్, పద్మనాభస్వామి, రమణ, విజయ కిషోర్, బోళ్ల పద్మ, అడబాల సత్యనారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

మళ్లీ మళ్లీ ఇది రాని రోజు



అంబాజీపేట జెడ్పీ హైస్కూల్‌లో ఒకే వేదికపై పూర్వ విద్యార్థులు



మోరి జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఆత్మీయ సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు



అవిడి చప్పిడివారిపాలెం హైస్కూల్లో నాటి గురువులతో పూర్వ విద్యార్థులు

అంబాజీపేట: స్నేహ బంధం ఎంతో మధురమైనది. జీవితాంతం తరిగిపోదు.. చెరిగిపోదు.. మొదటి స్నేహం ఏర్పడేది పాఠశాల స్థాయిలోనే.. ఎప్పుడు కలసినా ఏరా.. పోరా అని ఆప్యాయంగా పలకరించుకుంటూ ఆనాటి మధుస్మృతులను గుర్తు చేసుకుంటూ గడుపుతారు. చిన్ననాటి స్నేహానుబంధాన్ని మరోసారి ఆత్మీయ కలయిక ద్వారా పూర్వ విద్యార్థులు గుర్తు చేసుకున్నారు. అంబాజీపేట జెడ్పీ హైస్కూల్‌లో 2003–04లో పదో తరగతి విద్యార్థులు శనివారం ఘనంగా నిర్వహించిన పూర్వ విద్యార్థుల అపూర్వ కలయికతో కలుసుకున్నారు. 20 ఏళ్ల ఆనాటి అనుభూతులను ఒకరికొకరు గుర్తు చేసుకుని నెమరు వేసుకున్నారు. ప్రస్తుత వారి పరిస్థితి, చేసే ఉద్యోగం, కుటుంబ పరిచయాలతో పాఠశాల ఆవరణ సందడిగా మారింది. అనంతరం విద్యాబుద్ధులు నేర్పిన గురువులను దుశ్శాలువా, పూలమాలలతో ఘనంగా సత్కరించారు.

మోరిలో..

సఖినేటిపల్లి: మోరి జెడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం 1979–84 లోని 6 నుంచి పదో తరగతి బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. చదువులమ్మ చెట్టు నీడన చదువుకున్న వారంతా అదే పాఠశాలలో కలుసుకుని ఆనంద పరవశులయ్యారు. ఆటపాటలతో ఉత్సాహంగా, ఉల్లాసంగా రోజంతా గడిపారు. అలనాటి మధుర స్మృతులను గుర్తుకు తెచ్చుకున్నారు. ఒకరికొకరు యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. తమకు పాఠాలు నేర్పిన గురువులకు సత్కారాలు చేశారు.

అవిడి చప్పిడివారిపాలెంలో..

కొత్తపేట: మండలంలోని అవిడి చప్పిడివారిపాలెం రెడ్డి నరసింహం-వెంకాయమ్మ మెమోరియల్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో 1985–90 బ్యాచ్ విద్యార్థులు శనివారం పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక పేరుతో కలుసుకొన్నారు. ఆరో తరగతి నుంచి పదో తరగతి వరకూ ఆ పాఠశాలలో చదువుకుని ఉద్యోగులుగా వివిధ హోదాల్లో, వ్యాపారులుగా, రాజకీయ నాయకులుగా స్థానిక, స్థానికేతర ప్రాంతాల్లో స్థిరపడిన వారందరూ 33 ఏళ్ల తరువాత కలుసుకొన్నారు. అలాగే గురువులకు హృదయపూర్వకంగా రెండు చేతులతో నమస్కరించి, పలువురికి పాదాభివందనం చేసి గౌరవంగా ఆహ్వానించారు. ఆఖరున అందరూ గ్రూప్ ఫొటో దిగారు. ఈ విధంగా అవకాశం ఉన్నప్పుడల్లా కలుసుకోవాలని నిర్ణయించారు.

కోడి పందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు

ఆలమూరు: ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా కోడి పందేలు నిర్వహించినా లేక జూద క్రీడలకు పాల్పడినా చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని తహసీల్దార్ ఐపీ శెట్టి, ఎస్సై ఎల్.శ్రీను నాయక్ హెచ్చరించారు. రాష్ట్ర హైకోర్టు సూచనలు, జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మండలంలోని వివిధ గ్రామాల్లో మండల స్థాయి అధికారులు శనివారం పర్యటించి కోడి పందేలు నిర్వహించవద్దని, జూద క్రీడలను ప్రోత్సహించొద్దని ఆటోల్లో మైక్‌ను ఏర్పాటు చేసి ప్రచారం చేసి కరపత్రాలను పంపిణీ చేశారు. ఆయా గ్రామ పంచాయతీ కార్యాలయాల వద్ద సర్పంచ్‌ల అధ్యక్షతన అవగాహన సదస్సులు ఏర్పాటు చేసి సంక్రాంతి పేరిట గ్రామాల్లో చట్ట వ్యతిరేక కార్యకలాపాలు జరగకూడదని హితవు పలికారు. మండలంలో ఎక్కడైనా కోడిపందేల బరులు ఏర్పాటు చేస్తే స్థానికులు సత్వరమే సమాచారం అందించాలని విజ్ఞప్తి చేశారు.

యాగశాలను ప్రారంభించిన ఎమ్మెల్యే



అప్పనపల్లిలో యాగశాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే చిట్టిబాబు

మామిడికుదురు: అప్పనపల్లి బాల బాలాజీ స్వామి సన్నిధిలో నూతనంగా నిర్మించిన యాగశాలను ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు శనివారం ప్రారంభించారు. అంబాజీపేట మండలం మాచవరం మాజీ సర్పంచ్ సుంకర బాలాజీ, సత్యవేణి దంపతులు రూ.4 లక్షల విరాళంతో ఈ యాగశాలను నిర్మించారు. దీంతో పాటు పాత గుడి వద్దరూ.1.80 లక్షలతో ఆధునీకరించిన నిర్మాణాలను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆలయాల అభివృద్ధిలో దాతలు కీలక ప్రాత పోషిస్తున్నారని చెప్పారు. దాతలు అందిస్తున్న సహాయం మరువరానిదన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ గ్రంధి మాధవి, ధర్మకర్తల మండలి చైర్మన్ చిట్టూరి రామకృష్ణ, మాజీ చైర్మన్ పిచ్చిక చిన్న, సర్పంచ్ గెద్దం మంగాలక్ష్మి, మండల ఎంపీటీసీల సమాఖ్య అధ్యక్షుడు నెల్లి దుర్గాప్రసాద్, ట్రస్టు బోర్డు సభ్యుడు చిట్టాల సత్తిబాబు, కొమ్ముల సూరిబాబు, గూటం శ్రీను, బత్తుల గంగారత్నం పాల్గొన్నారు.

గ్రామాల్లో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర

కొత్తపేట: వికసిత్ భారత్ సంకల్ప యాత్ర పేరిట కేంద్ర ప్రభుత్వ పథకాల ప్రచార కార్యక్రమం శనివారం మండల పరిధిలో ప్రారంభించారు. ఉదయం అవిడి గ్రామ పంచాయతీ కార్యాయలం వద్ద సర్పంచ్ రెడ్డి చంటి అధ్యక్షతన, మధ్యాహ్నం ఖండ్రిగ గ్రామంలో సర్పంచ్ దూనబోయిన నవదీప అధ్యక్షతన నిర్వహించారు. వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు. రాష్ట్ర బీజేపీ కార్యవర్గ సభ్యుడు పాలూరి సత్యానందరావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ, అభివృద్ధి పథకాలను వివరించారు. భవిష్యత్‌లో మరిన్ని బృహత్తర పథకాలు అమలుకు నరేంద్రమోదీ ప్రభుత్వం ప్రణాళిక రూపొందించిందన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జ్ అయినవెల్లి సత్తిబాబు, ఆయా గ్రామాల కార్యదర్శులు ఎస్.రెడ్డినాయుడు, శాంతి తదితరులు పాల్గొన్నారు.

వేంకటేశ్వర ఆలయాల్లో ప్రత్యేక పూజలు

ఆలమూరు: మండలంలోని వివిధ గ్రామాల్లో వేంచేసిన శ్రీ, భూ సమేత వేంకటేశ్వరస్వామి ఆలయాలు శనివారం భక్తులతో కిక్కిరిసిపోయాయి. చింతలూరు, సంధిపూడి, గుమ్మిలేరు, నర్సిపూడి, జొన్నాడ గ్రామాల్లోని ఆలయ ఆవరణలో భక్తులు గోవింద నామస్మరణతో ప్రదక్షిణలు చేస్తూ భక్తిపారవశ్యం చెందారు. ఆయా ఆలయాల్లో దేవతామూర్తుల విగ్రహాలను అలంకరించిన తీరు విశేషంగా ఆకట్టుకుంది. చింతలూరులోని గోశాలను దర్శించుకున్న భక్తులు గోమాతలకు పూజలను నిర్వహించారు. చింతలూరులో ఆలయ మండపంలో ఏర్పాటు చేసిన ఆధ్యాత్మిక, సాంస్కృతిక, భజన కార్యక్రమాలు భక్తులను అలరించాయి.

నల్లచెరువులో..

అయినవిల్లి: మండలంలోని నల్లచెరువులో వేంచేసిన అలిమేలు మంగా, పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారుజామున తోమాల సేవ, అర్చన, నైవేద్యం, నక్షత్ర హారతి, కుంభ హారతి ఇచ్చారు. వేదపండితులు స్వామికి తులసి పూజలు జరిపారు. స్వామిని వివిధ పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. భారీ అన్నదానం ఏర్పాటు చేశారు.

28న మాదిగల మహాసభను విజయవంతం చేయాలి

పి.గన్నవరం: మాదిగల రాజకీయ జేఏసీ ఆధ్వర్యంలో ఈనెల 28న పి.గన్నవరం శివారు పోతవరంలో జరగనున్న మాదిగల రాజకీయ భవిష్యత్ మహాసభను విజయవంతం చేయాలని జేఏసీ కమిటీ నాయకులు పిలుపునిచ్చారు. దీనికి సంబంధించిన కర పత్రాలను శనివారం పి.గన్నవరంలో కమిటీ నాయకులు విడుదల చేశారు. ఈ సభకు ముఖ్యఅతిథిగా కేంద్రమంత్రి అబ్బయ్య నారాయణస్వామి హాజరు కానున్నారని నాయకులు వివరించారు. స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి ఉమ్మడి జిల్లాలో మాదిగలకు రాజకీయ పార్టీలు ఒక ఎమ్మెల్యే, ఎంపీ స్థానాన్ని కూడా కేటాయించలేదని ఆవేదన వ్యక్తం చేసారు. ఈ సమావేశం ద్వారా మాదిగల ఐక్యతను చాటాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జేఏసీ కమిటీ నాయకులు చుట్టుగుళ్ల నీలకంఠం, ఉలంపర్తి వీర భాస్కరరావు, మడికి శ్రీరాములు, తెన్నేటి రాజబాబు, ఆకుమర్తి ఆశీర్వాదం, ఉందుర్తి నాగబాబు, ఆకుమర్తి శ్రీను, చెయ్యేటి శ్రీను, ఆకుమర్తి సత్యనారాయణ, మల్లవరపు వెంకన్న, తవిటికి వీరాభిమన్యుడు తదితరులు పాల్గొన్నారు.